క్లుప్తంగా

బోయిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



బోయిమాంబ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కల్పన

పరవాడ: మండలంలో పి.బోనంగి శివారు వీఎల్ఎస్ పురం గ్రామంలో కొలువైన బోయిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న అమ్మవారి పురాతన ఆలయాన్ని తొలగించి దాతల సహాయంతో పునర్నిర్మాణం చేపట్టడానికి చర్యలు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు చిన్నారావు, బండారు బోయన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు డెక్క శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు దంపతులు, బండారు అప్పారావు దంపతులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీ షీటర్లకు సూచించారు. గొడవలు, తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని, మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లను సిబ్బంది వారి ఇళ్ల వద్ద అప్పగించి వచ్చారు.

చక్కటి పుస్తకం..మంచి నేస్తం

అల్లిపురం: చక్కటి పుస్తకం.. మంచి నేస్తంతో సమానం అని ఉపాధ్యాయురాలు ఎస్. ఆరావతి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలు బోధించారు. సెల్ ఫోన్ వినియోగించుకుండా గ్రంథాలయానికి వచ్చి మంచి పుస్తకాలు చదవటంతో పాటు విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని గుడి లేని దైవం అమ్మ అని వివరించారు. కల్మషం లేని ప్రేమ అమ్మది అని తెలిపారు. గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు. వేసవి శిక్షణ శిబిరం గురించి స్నేహితులకు చెప్పి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు అమ్మ కోసం (మాతృ దినోత్సవం) వివరించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ హిందీ మాస్టర్ కె. రమేష్ పాల్గొని మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అంటూ అమ్మకే అగ్రతాంబూలం ఇస్తారని, సృష్టిలో ప్రతి ప్రాణికి మూల కారణం అమ్మ అని వివరించారు.

బాలిక వైద్యానికి సహకరించండి

సీతమ్మధార: జీబీ సిండ్రోమ్‌తో గత కొన్నేళ్లుగా మంచానికే పరిమితమైన ద్వారకానగర్‌కు చెందిన చిన్నారి కావ్య చికిత్సకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ నగర కమిటీ ప్రతినిధులు సమకూర్చిన పదిహేను వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆదివారం బాలిక ఇంటికి వెళ్లి చిన్నారి తండ్రి హరికుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వైద్య పరీక్షల్లో నాడి, రక్తపోటు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ శరీరం అచేతనంగా ఉంటుందన్నారు. రూ.50 లక్షలు అప్పు చేసి వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించిన ఈమె తండ్రి రైల్వే ఉద్యోగానికి సైతం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని గుర్తు చేశారు. తండ్రి పెన్షన్‌తోనే అరకొర వైద్యం అందిస్తు ఇక తాము ఆర్థికంగా తట్టుకోలేమని, వైద్యం నిలిపివేస్తామని కన్నీటి పర్యంతంతో వాపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి బాలిక వైద్యానికయ్యే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టి తీసుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టా ఫౌండేషన్ పట్టా రమేష్, ఫోరం డాక్టర్ శకుంతల, కె.ఎల్లయ్య, డాక్టర్ ఆదిమూర్తి, హరిష్ పాల్గొన్నారు.

శ్రీరామదూతం.. శిరసానమామి

భక్తాగ్రణ్యుడు, అంజనీ సుతుడైన హనుమకు ఆదివారం విశేష పూజలు చేశారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని వాడవాడలా వేడుకలు నిర్వహించారు. రామభక్త హనుమాన్ కీ జై అంటూ కీర్తించారు. ఆలయ ప్రాంగణాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

- వాడవాడలా వేడుకగా హనుమజ్జయంతి
- పవన సుతుడికి ప్రత్యేక పూజలు
- వెంకటాద్రిపై విశేష అర్చనలు



వెంకటాద్రిపై ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

సింహాచలం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన అభయ ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సిందూర అర్చన నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. పంచవటి ఆధ్యాత్మిక సంస్థ సభ్యులైన శేఖర మహంతి రచించిన ఆంజనేయ శతకం, పూజా విధాన పుస్తకాన్ని న్యాయవాది వి.వి.రమణ ఆవిష్కరించారు. దేవస్థానం ప్రధానార్చకుడు రామానుజం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

● 95వ వార్డు పరిధి లక్ష్మీపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతిని విశేషంగా నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు స్వామికి విశేష పూజలు చేశారు. 3వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్.వెంకటరమణ, సోషల్ మీడియా కన్వీనర్ కె.సంతోష్, ఎస్.గురాజీ, వై.వెంకటరమణ, బి.అచ్చిబాబు, ఎం.కృష్ణ, అప్పారావు, కె.సత్తిబాబు, గణేష్ యూత్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● పురుషోత్తపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.మల్లికార్జునరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్



ఆంజనేయ శతకం, పూజా విధాన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న న్యాయవాది వి.వి.రమణ

బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు యలమంచిలి శ్రీను, ఆబోతు శ్రీను, జొన్నాడ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● సింహగిరి మెట్లమార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, తమలపాకుల పూజ, సిందూర పూజ నిర్వహించారు. అనంతరం శ్రీరామపట్టాభిషేక సర్గ పారాయణం చేశారు. ఆలయం వద్ద మండపంలో హోమం జరిపించారు. భక్తులు, అడవివరం గ్రామస్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

పరవాడ: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని



పురుషోత్తపురంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

స్థానిక సినిమా హాలు కూడలిలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వేకువజాము నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. స్వామిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు. పరవాడ సినిమాహాలు కూడలి, సబ్‌స్టేషన్, సంతబయలు ప్రాంతాల్లో కొలువుదీరిన ఆంజనేయస్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. సినిమా హాలు కూడలిలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను గ్రామ పెద్దలు ప్రారంభించారు. పరవాడ పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

● రావాడ శివారు బొట్టవానిపాలెంలోని అభయాంజనేయస్వామిని గ్రామ పెద్దలు వియ్యపు చిన్న తదితరులు దర్శించుకున్నారు. వెన్నలపాలెం, ధర్మారాయుడుపేట, కొత్త వెన్నలపాలెం, మెట్టపాలెం, దేశపాత్రునిపాలెం, పెదముషిడివాడ, భర్నికం● గొర్లివానిపాలెం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తానాం గ్రామంలోని అభయాంజనేయస్వామిని సర్పంచ్ కన్నూరి దేవి, వెంకటరమణ దర్శించుకున్నారు.

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రావలమ్మపాలెం, సబ్బవరం, జోడుగుళ్ల, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, ఆరిపాక గ్రామాలలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రావలమ్మపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, వీకేపీసీపీఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు,



పరవాడలోని పంచముఖ ఆంజనేయ స్వామి సన్నిధిలో గ్రామ పెద్దలు, భక్తులు



బొట్టవానిపాలెంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న రావాడ గ్రామ పెద్దలు



రావలమ్మపాలెంలో పూజలు చేస్తున్న చొక్కాకుల వెంకటరావు, భక్తులు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు

తదితరులు హనుమాన్ దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆయా గ్రామాల్లో భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సబ్బవరంలోని జోడుగుళ్ల వద్ద మాజీ సర్పంచ్ మండల సముద్రం, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు మోపాడ కన్నయ్య, కర్రి రాజు, భాస్కరరావు, తదితరులు మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

శ్రీశారదా పీఠంలో..



దాసాంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీశారదా పీఠంలో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పీఠంలో కొలువైన 18 అడుగుల దాసాంజనేయస్వామికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిజీ విశేష అభిషేకాలు చేశారు. హనుమంతుని ఆరాధన వల్ల కార్యసాధనలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ఈ సందర్భంగా స్వామిజీ అనుగ్రహభాసనం చేశారు. భక్తులకు ఆశీస్సులు అందించారు. పీఠం ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సబ్బవరం శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అధికారి వి.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి క్విజ్ పోటీల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు మేధాశక్తి పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే అనేక పోటీ పరీక్షలకు క్విజ్ పోటీలు ఉపయోగపడతాయన్నారు. విజేతలకు శిబిరం ముగింపు రోజున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం



మాతృ దినోత్సవ విశిష్టతను తెలియజేస్తున్న రాజేంద్రప్రసాద్

సింహాచలం: మాతృ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అడవివరం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు అమ్మ ఔన్నత్యాన్ని వివరించారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షుడు బి.బి.రాజేంద్ర ప్రసాద్ తల్లిదండ్రుల గొప్పతనాన్ని వివరించారు. ప్రతీ ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై పొట్నూరి లక్ష్మణరావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. గణితంలో మెలకువలపై దీప్తి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, న్యాయవాది రామకృష్ణ, ఎం.అజయ్, కె.సంధ్య, వర్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కాలువ



దేశపాత్రునిపాలెంలో పూడుకుపోయిన కాలువ

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. దేశపాత్రునిపాలెం-జాజులవానిపాలెం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. దుర్వాసనతో రహదారి ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డు పక్క నుంచి ప్రవహిస్తున్న మురుగు కాలువను గుర్తించకుండా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఏరులా పారుతున్న మురుగు కాలువను సీసీ కాలువగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పరవాడ జెడ్పీ బాలికల పాఠశాల 2002-03 బ్యాచ్ విద్యార్థినులు

పరవాడ: ఇరవై ఏళ్ల క్రితం పరవాడ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కలిసి చదువుకున్న 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థినులు ఆదివారం స్టీల్‌ప్లాంట్ ఇందిరా గాంధీ పార్కులో సమావేశమయ్యారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కుటుంబ పరిస్థితులపై ఆరా తీసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు.


ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డు ఉద్యమం



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ ఉత్తరాలు రాస్తున్న స్థానికులు

ఆరిలోవ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉత్తరాలు రాసే కార్యక్రమం నిర్వహించింది. ముందుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను స్థానికులకు వివరించారు. అనంతరం సుమారు 60 మంది 'స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపండి'అంటూ ప్రధానమంత్రి మోదీకి ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ప్రియాంక మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన సుమారు 8 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వకుండానే పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన హక్కులను కేంద్ర ప్రభు త్వం కాలరాస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పలు కమిటీలు చేపడుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొనాలని ఆమె కోరారు. పోస్టుకార్డు ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు జగన్, సుశ్చల్, నాగరాజు, హర్ష పాల్గొన్నారు.

విమ్స్‌లో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు



ఔట్ పోస్టు సేవల గురించి వివరిస్తున్న ఏసీపీ

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(విమ్స్)లో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఇక్కడ క్యాజువాలిటీ విభాగంలో ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించారు. దీనిని ఆదివారం ద్వారకా ఏసీపీ మూర్తి ప్రారంభించారు. విమ్స్ వైద్యులు, సిబ్బందికి అవుట్ పోస్టులో ఏరకమైన సేవలు అందుబాటులో ఉంటాయో వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విమ్స్‌లో అవుట్ పోస్టు ఏర్పాటు చేయడం వల్ల క్యాజువాలిటీలో అత్యవసర సమయంలో సత్వరం వైద్యం అందడానికి, ప్రమాద కేసులు నమోదు చేయడానికి వీలు పడుతుందని చెప్పారు.

భారతీయ సంప్రదాయ సంగీతం అద్భుతం

- డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి
- ఆకట్టుకున్న డీసీఏ సంగీత్ మేళా



సంగీత్ మేళాలో పాల్గొన్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్(డీసీఏ) ఆదివారం రైల్ గార్డెన్‌లో నిర్వహించిన క్లాసికల్ సంగీత్ మేళా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ కళాకారుల్లోని కళలను ఇతరులకు తెలియజేసేదిగా ఈ సంగీత కార్యక్రమం ఉందన్నారు. భారతీయ సంప్రదాయ సంగీతం నిర్మలమైనది, అద్భుతమైనదని అభివర్ణించారు. ఇటువంటి సంగీతాన్ని శ్రోతలకు వినిపించడానికి ఈకార్వో, డీసీఏ చేస్తున్న ప్రయత్నాన్ని డీఆర్ఎం అభినందించారు. ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం మొదటిదని, దీని ద్వారా రైల్వే ఉద్యోగులు, సంగీత ప్రేమికులు చాలా ప్రోత్సాహం పొందారని తెలిపారు. వాల్తేర్ డివిజన్ కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన గాయకులు జి.వి.సురేష్, కె.వి.సురేష్, రణధీర్‌కుమార్, ఎస్.ఎ.రాజు, ఎం.భారతి, వాయిద్యకారులు యు.శ్రీనివాస్ తదితరులు హిందుస్థానీ, కర్ణాటక, భజన్లను ఆలపించారు. తమ ప్రదర్శనతో శ్రోతలు, సంగీత ప్రేమికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు అల్పాహారం

పెదగంట్యాడ: డీవీఆర్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు డీవీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక జనరేషన్ యువ అనాథశ్రమంలోని 30 మంది బాలలకు ఆదివారం అల్పాహారం అందజేశారు. అలాగే చిన్నారులకు ఎగ్జామ్ ప్యాడ్స్, కంపాస్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీవీ శంకరరావు, సూర్యచంద్ర, పితాని శ్రీను, డీవీటీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమిస్తున్నారన్న ఉక్రోషంతోనే ఉత్పత్తి నిలిపివేత



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమిస్తుందన్న ఉక్రోషంతోనే స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపి వేశారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 822వ రోజు ఆదివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం కూడా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నిస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

తుపాను భవనం శిథిలం!



కూలడానికి సిద్ధంగా ఉన్న తుపాను షెల్టర్

పరవాడ: కలపాక శివారు స్వయంభూవరంలోని తుపాను షెల్టర్ శిథిలావస్థకు చేరింది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 40 ఏళ్ల కిందట బాధితుల రక్షణార్థం ప్రభుత్వం తుపాను భవనం నిర్మించింది. అయితే కొంత కాలంగా దీని నిర్వహణ లేకపోవడంతో శిథిల దశకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ భవనంలో స్థానికులు పశువులు కట్టుకొంటున్నారు. భవనం ఏ సమయంలో కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భవనాన్ని తొలగించాలని అధికారులను కోరినా వారు పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న తుపాను భవనాన్ని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్సిటీని సందర్శించిన పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విశిష్ట స్థానాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సందర్శించారు. సివిల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి ఏసీసీఓఎం సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి.రామలింగరాజు, ఒరాకిల్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.నరసింహారావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ సాధిస్తున్న ప్రగతిని వీసీ వారికి వివరించారు. స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలను నెలకొల్పడం, చైర్ ప్రొఫెసర్ల ఏర్పాటు, క్రీడా మైదానాల అభివృద్ధి, తదితర అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ రామలింగరాజు ఏయూలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. అదే విధంగా ఎంటెక్(జియోటెక్నికల్ ఇంజినీరింగ్)లో బంగారు పతకాన్ని ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని వర్సిటీ తరఫున వీసీ సత్కరించారు. అనంతరం వారు ఏయూ స్టార్టప్ సెంటర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిని గౌరవించడం మన సంస్కృతి



మాతృమూర్తికి చీర అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: తల్లిని గౌరవించడం భారతదేశ సంస్కృతిలో భాగమని 30 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు అన్నారు. మాతృమాల సేవా సంఘం, గీతా చానల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రాంగణంలో అంతర్జాతీయ మాతృదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాతృమూర్తులకు వారి పిల్లల చేత పాద పూజ చేయించారు. అనంతరం వారికి చీరలు, పండ్లు, భగవద్గీత, తాంబూలం అందించారు. మాతృమాల సేవా సంఘం వ్యవస్థాపకుడు కోన వెంకటరావు, గీతా చానల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మండా విజయ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు పిన్నమనేని శ్రీనివాస్, రాజశేఖర్, నవీన్‌కుమార్, రవి లాల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.